రోడ్లపైనే చెత్త డంపింగ్‌..!

పట్టించుకోని అధికారులు


రోడ్డుపక్కన చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం

జీడిమెట్ల: ఎస్వీ కోఆపరేటీవ్‌ సొసైటీలోని కొంతకాలంగా రోడ్లలోనే స్థానికంగా ఉన్న స్క్రాప్‌ గోదాములు, పరిశ్రమల నుంచి చెత్తా చెదారాలను తీసుకువచ్చి విచ్చలవిడిగా డంప్‌ చేస్తున్నారు. అయితే రాత్రి సమయాల్లో సొసైటీలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో ఆ చెత్త నుంచి వచ్చే వాసన, పొగలతో స్థానికులు తీవ్ర అవస్థలకు లోనవుతున్నారు. అంతేకాకుండా చెత్తను రోడ్లపై డంప్‌ చేయడంతో రోడ్లు చెత్త కుండీలను తలపిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

రోడ్లపై చెత్తను వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని ఎస్వీ కోఆపరేటీవ్‌ సొసైటీలో మాత్రమే రోడ్లపై చెత్తను డంప్‌ చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఇక్కడి అధికారులు దీనిపై దృష్టిసారించకపోవడం వల్లే ఇలా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త డంప్‌ చేసే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారిలో ఎటువంటి భయం లేకుండా యథేచ్ఛగా రోడ్లపై డంప్‌ చేసి వెళ్లిపోతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్లపై చెత్తను డంప్‌ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్‌ పనులను త్వరితంగా పూర్తి చేయండి

ఎమ్మెల్యే వివేకానంద్‌


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల సముదాయంలో పెండింగ్‌ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. మంగళవారం పేట్‌ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో హౌసింగ్‌ బోర్డ్‌, విద్యుత్‌ శాఖ, జీహెచ్‌ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దుండిగల్‌, డీపోచంపల్లి, బహదూర్‌పల్లి, బాచుపల్లి ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చి వారు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను నిర్మించడం జరిగిందన్నారు. గృహ సముదాయాల్లో లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, విద్యుత్‌ సదుపాయం, రోడ్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డబుల్‌ బెడ్‌ రూమ్‌ లబ్ధిదారులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ఇప్పటికే బస్సు సౌకర్యాన్ని కల్పించామని, నగరంలోని అన్ని ప్రాంతాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాన్ని కల్పించడంతో పాటు మౌలిక వసతులను పూర్తిచేస్తామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణయాదవ్‌, జక్కుల విజయ, గోపాల్‌రెడ్డి, పాక్స్‌ డైరెక్టర్‌ ఎల్లకంటి శ్రీను, నల్తూరి కృష్ణ, మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ రవీందర్‌ యాదవ్‌, హౌసింగ్‌ బోర్డ్‌ ఇంజినీరింగ్‌ ఈఈ రవీందర్‌, డీఈలు మారుతి, నరసయ్య, విద్యుత్‌ శాఖ డీఈఈ సత్తెమ్మ, ఏఈ సీహెచ్‌. రమేష్‌, జీహెచ్‌ఎంసీ ఈఈ లక్ష్మీ గణేష్‌, డీఈ పాపమ్మ, దుండిగల్‌ ఏఈ సురేందర్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం ప్రదక్షిణలు

- బిల్లులు రాక కాంట్రాక్టర్ల తీవ్ర ఇబ్బందులు
- పనులు చేసి.. నిధులు కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు
- సంవత్సర కాలంగా ఇదే తంతు
- ఆరు నెలలుగా అభివృద్ధి పనులపై నీలినీడలు


గాజులరామారం సర్కిల్‌ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు.. (ఫైల్‌ ఫొటో)


జయరాంనగర్‌లో రూ.90 లక్షలతో వేసిన సిసి రోడ్డు..(ఫైల్‌ ఫొటో)

కుత్బుల్లాపూర్‌: జంట సర్కిళ్ల పరిధిలో పనిచేసే కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయల విలువచేసే అభివృద్ధి పనులు చేపట్టి బిల్లుల కోసం అటు కుత్బుల్లాపూర్‌.. ఇటు గాజులరామారం ఇంజినీరింగ్‌ అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతూ బిల్లుల కోసం కాళ్లా వేళ్లా పడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. డబ్బులు లేవు..! మేము ఏమి చేయాలి..!! అంటూ సమాధానం చెబుతున్నారని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. సంవత్సర కాలంగా బిల్లులు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, పనుల కోసం తెచ్చిన వాటికి వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులపాలవుతున్నామని సదరు కాంట్రాక్టర్లు 'సాక్షి'తో వాపోయారు.

30 మందికి పైగా స్థానిక కాంట్రాక్టర్లు...

కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు టెండర్ల ద్వారా పనులు దక్కించుకుని పూర్తి చేసుకున్న కాంట్రాక్టర్లు సుమారు 30మందికి పైగా ఉన్నారు.. వీరికి పనులు పూర్తయినా ఇంజినీరింగ్‌ అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. రోడ్లు, డ్రైన్‌, పార్కులు కలిపి సుమారు 150 అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 100 కోట్ల వరకు గ్రేటర్‌ అధికారులు చెల్లించాల్సి ఉంది. కానీ సంవత్సర కాలంగా ఎటువంటి బిల్లులు చెల్లించకుండా ఇదిగో.. అదిగో అంటూ కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తూ బిల్లుల కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.

ఆరు నెలలుగా అభివృద్ధిపై నీలినీడలు...

గ్రేటర్‌ పరిధిలోని కుత్బుల్లాపూర్‌, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఆరు నెలలుగా ఎటువంటి అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ జరగకపోవడం విశేషం. ఇప్పటికే కాంట్రాక్టర్లు పనులు చేపట్టి బిల్లుల కోసం తిరుగుతుండగా, ఇదే క్రమంలో స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్పొరేటర్లు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతున్నా.. ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడం విశేషం. ఇలా అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒకవైపు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా.. మరోవైపు అభివృద్ధి పనులకు టెండర్లు పిలవకపోడంతో గ్రేటర్‌ అధికారులపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది.

బిల్లులు చెల్లించాలని ఆందోళనలు..

గ్రేటర్‌ పరిధిలో మొత్తం కాంట్రాక్టర్ల పరిస్థితి ఇలాగే ఉండగా... కూకట్‌పల్లి జోనల్‌ పరిధిలో ఉన్న ఐదు సర్కిళ్లలో రూ. 250 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయినా బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు. దీంతో ఈ విషయంపై గతంలో కాంట్రాక్టర్లు ఆందోళనలు సైతం చేశారు. అయినప్పటికీ అధికారులు బిల్లులు చెల్లించిన దాఖలాలు లేవు. తాము వడ్డీలకు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేస్తే.. బిల్లులు ఇచ్చే విషయంలో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంట్రాక్టర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు వాపోతున్నారు.

దశలవారీగా చెల్లిస్తున్నాం...



జంట సర్కిళ్ల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు బిల్లును చెల్లించే విషయంలో కొంత జాప్యం జరిగిన విషయం వాస్తవమే. గ్రేటర్‌ నుంచి వచ్చే నిధులను పనులు చేపట్టిన క్రమ పద్ధతిని అనుసరించి రొటేషన్‌ ద్వారా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ వస్తున్నాం. ప్రధానంగా నిధుల కొరత ఉండడంతో ఈ సమస్య ఉత్పన్నం అయింది. త్వరలోనే కాంట్రాక్టర్లకు బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటాం.

–మల్లారెడ్డి, గాజులరామారం ఉప కమిషనర్‌

ఉత్తీర్ణతపై దృష్టిసారించాలి


అధ్యాపకులకు సూచనలు ఇస్తున్న డీఐఈవో కిషన్‌

సుభాష్‌నగర్‌: విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా ప్రత్యేక తరగతులను నిర్వహించాలని మేడ్చల్‌ జిల్లా డీఐఈవో కిషన్‌ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమైన కిషన్‌ వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు స్టడీ అవర్స్‌ను ఏ,బీ, సీలు విభజించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కువగా దుమ్మాలు కొడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారు రెగ్యులర్‌గా తరగతులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా విద్యార్థులతో సమావేశమైన ఆయన వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్‌ నాగేందర్‌, అధ్యాపకులు ఉన్నారు.

మేయర్‌ నీలారెడ్డికి ఆహ్వానం



నిజాంపేట్‌: డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ రాజ్యాంగం ద్వారా నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని నిజాంపేట్‌ మేయర్‌ కొలన్‌ నీలారెడ్డి అన్నారు. బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీ, ఇందిరమ్మకాలనీ ఫేస్‌–1 వాసులు మంగళవారం మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి రావాలని కోరుతూ మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

అన్నదానం

కుత్బుల్లాపూర్‌: జీడిమెట్ల డివిజన్‌ పేట్‌బషీరాబాద్‌ శ్రీకట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌ రెడ్డి, శైలజ దంపతులు, అనంతరం త్రిశూల్‌ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి మంగళవారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని రెండు సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతూ వస్తుందని ఆలయ కమిటీ పేర్కొంది. 41 రోజులపాటు దీక్షలో ఉన్న అయ్యప్పమాల వేసుకున్న ప్రతి ఒక్కరికి ఇక్కడ నిత్య అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.



హత్య కేసులో ఇద్దరి రిమాండ్‌

ఆస్తి కోసం స్నేహితుడితో కలిసి తమ్ముడిని హత్య చేసిన అన్న

దుండిగల్‌: ఆస్తి వివాదాల నేపథ్యంలో సొంత తమ్ముడిని హత్య చేసిన ఘటనలో అన్నతో పాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని దుండిగల్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... మెదక్‌ జిల్లా కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌ గ్రామానికి చెందిన సత్యనారాయణ గౌడ్‌కు మాదాసు సంతోష్‌గౌడ్‌ (32), సందీప్‌ గౌడ్‌(30) ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరికి వివాహాలు కాగా సంతోష్‌ కుత్బుల్లాపూర్‌లోని వెంకటేశ్వరనగర్‌లో ఉంటూ ఆర్టీఏ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. సందీప్‌ సొంత గ్రామంలోనే ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. కొంత కాలంగా అన్నదమ్ముళ్ల మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో తమ్ముడి అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నిన అన్న అతన్ని హత్య చేసేందుకు పథకం రచించాడు. దీనిలో భాగంగా అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు మన్నె శేఖర్‌ (34) సహాయం కోరాడు. ఈ క్రమంలో ఈ నెల 21న ఆస్తి విషయంపై మాట్లాడుదామని చెప్పి సంతోష్‌ తన స్నేహితుడితో తమ్ముడు సందీప్‌ను నగరానికి రప్పించాడు. ముగ్గురు కలిసి బహదూర్‌పల్లి సాయినాథ్‌ సొసైటీలోని నిర్మానుష ప్రాంతంలో మద్యం సేవించారు. అక్కడ సోదరుల మధ్య మరోసారి వాగ్వాదం జరగడంతో కోపోద్రిక్తుడైన అన్న తమ్ముడిపై రాడ్డుతో దాడి చేసి హత మార్చాడు. అక్కడి నుంచి సంతోష్‌, శేఖర్‌లు పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న దుండిగల్‌ పోలీసులు మంగళవారం సంతోష్‌, శేఖర్‌లను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి బైక్‌, ఆటో, రెండు సెల్‌ఫోన్లు, రాడ్డును స్వాధీనం చేసుకున్నారు.

హక్కులపై అవగాహన ఉంటే మోసపోం

కుత్బుల్లాపూర్‌: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉంటే మోసపోయే ఆస్కారమే ఉండదని జిల్లా పౌర సరఫరాల శాఖ నిఘా కమిటీ సభ్యుడు, వినియోగదారుల సమాచార కేంద్రం ఇన్‌చార్జి చికిలె మధుబాబు అన్నారు. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సూరారం డివిజన్‌ రాజీవ్‌గాంధీనగర్‌లోని గీతాంజలి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ మనం పుట్టిన నాటినుంచి చనిపోయేంత వరకు వినియోగదారులమేనని, మన హక్కుల గురించి పూర్తి అవగాహన ఉంటే మోసపోకుండా ఉంటామన్నారు. నేడు సైబర్‌, ఆర్థిక నేరాలు ఎక్కువయ్యాయని, మనం ఎంతో జాగ్రత్తగా ఉండటం మంచిదన్నారు. వినియోగదారు న్యాయపాలన వర్చువల్‌ విచారణ, డిజిటల్‌ సౌలభ్యం అనే అంశంపై వివరించారు. ఎవరైనా వినియోగదారుడు మోసపోయినట్లయితే కన్జ్యూమర్‌ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1915, 1800114000లకు ఫోన్‌ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ మహిపాల్‌ రెడ్డి, మానవ హక్కుల యువజన కన్వీనర్‌ అమర్‌ కాంబ్లె, దాసరి నటరాజ్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామి శ్రద్ధానందకు ఘన నివాళి



నిజాంపేట్‌: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు స్వామి శ్రద్ధానంద సరస్వతి తన ప్రాణాలను విడిచారని డాక్టర్‌ ఎం.ఆర్‌.ఎస్‌.రాజు అన్నారు. స్వామి శ్రద్ధానంద సరస్వతి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ప్రగతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలవంతంగా మతం మార్చబడిన రెండు లక్షల మంది రాజ పుత్రులను శుద్ధి కార్యక్రమం ద్వారా తిరిగి స్వధర్మంలోకి చేర్చిన మహనీయులు స్వామి శ్రద్ధానంద అని కొనియాడారు. గురుకుల విద్యాలయాలు స్థాపించి హిందూ ధర్మానికి ఎనలేని సేవలందించారని, ఆయన స్ఫూర్తితో నేటి యువత సనాతన స్వధర్మ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్వాల దేవేందర్‌ రెడ్డి, నాగిశెట్టి శేషారావు, నరేంద్ర చౌదరి, మైలారం అశోక్‌, అజయ్‌రెడ్డి, వెంకటేశ్‌, సత్య కాటేపల్లి, లింగారెడ్డి, అశ్విన్‌, రామ్‌గోపాల్‌, వినీత్‌ రెడ్డి, రమేశ్‌, విజయ్‌, రాధిక తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ నిరంతర పోరాటం

కుత్బుల్లాపూర్‌: కార్మికుల హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ పోరాడుతూనే ఉంటుందని ఈ సంస్థ నేత చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడకు చెందిన ధర్మో కేబుల్‌ కంపెనీలో సోమవారం నూతనంగా వేతన ఒప్పందం జరిగింది. డిప్యూటీ కమిషనర్‌ ఆఫ్‌ లేబర్‌ శ్యాంసుందర్‌ రాజు సమక్షంలో యూనియన్‌ అధ్యక్షుడు నాగరాజు యాజమాన్యంతో వేతన ఒప్పందానికి సంబంధించి అగ్రిమెంట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి రూ.10వేల వేతన పెంపుతో పాటు కాంట్రాక్ట్‌ కార్మికులను రెగ్యులరైజ్‌ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా రెండు జతల డ్రెస్సులు, బూట్లు, టూర్‌ అలవెన్స్‌, రూ.2 లక్షల హెల్త్‌ ఇన్సూరెన్స్‌, నెల జీతం బోనస్‌గా ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేశామని, ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ వైస్‌ ప్రెసిడెంట్‌ రమేష్‌ వర్మ, హెచ్‌ఆర్‌ అడ్మిన్‌ మనోహర్‌ హెగ్డే, మనోజ్‌ అగర్వాల్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ ఫిలిప్స్‌, జనరల్‌ సెక్రటరీ వెంకట్‌ రెడ్డి, జాయింట్‌ సెక్రటరీలు మచన్‌ఖాన్‌, భాస్కర్‌ రెడ్డి, సీహెచ్‌ సురేష్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీలు పీకే మాలిక్‌ దాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్‌ స్థాయి వైద్యం

కుత్బుల్లాపూర్‌: సీఎం రిలీఫ్‌ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్‌ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందిన మనిశేఖర్‌ గౌడ్‌కు రూ. 26 వేలు, విజయ గీతాంజలికి రూ. 60 వేలు, బి. పద్మకు రూ. 60 వేల చెక్కులను మంగళవారం ఆయన నివాసంలో అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మాజీ కౌన్సిలర్‌ బొబ్బ రంగారావు, సిహెచ్‌ బుచ్చిరెడ్డి, కూన రాఘవేందర్‌ గౌడ్‌, మల్లేష్‌ యాదవ్‌, అరుణ్‌ కుమార్‌, కె శంకర్‌, ప్రభాకర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌ వేడుకల్లో త్రిపుర గవర్నర్‌ ఇంద్రసేనారెడ్డి



కుత్బుల్లాపూర్‌: త్రిపుర గవర్నర్‌ ఇంద్రసేనారెడ్డిని మంగళవారం కొంపల్లిలో జరిగిన క్రిస్మస్‌ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెయింట్‌ ఆంథోనీ విద్యా సంస్థల డైరెక్టర్‌ సుందరరాజు ఆయన్ని శాలువతో సత్కరించి క్రిస్మస్‌ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫిబ్రవరి నెలలో జరిగే పాఠశాల సిల్వర్‌ జూబ్లీ వేడుకలకు రావాలని కోరుతూ గవర్నర్‌ ఇంద్రసేనారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీజేపీ కార్యవర్గ సభ్యుడు అరుల్‌ రాజు, మల్లవరపు ధన్‌రాజు, నరిశెట్టి లిఖిత్‌ తదితరులు ఉన్నారు.



చౌరస్తా విస్తరణ పనులు ప్రారంభం



సుభాష్‌నగర్‌: నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే గాజులరామారం చౌరస్తా విస్తరణను అధికారులు ఎట్టకేలకు ప్రారంభించారు. మంగళవారం పనులు ప్రారంభం కాగా ఏఈ కళ్యాణ్‌ పరిశీలించారు. సుమారు కోటి 40 లక్షల వ్యయంతో చౌరస్తాకు ఇరువైపులా 50 మీటర్ల పొడవుతో విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. కాగా చౌరస్తాకు నాలువైపులా రోడ్డుపై ఉన్న స్తంభాలను మాత్రం సంబంధిత అధికారులు తొలగించలేదు. వీటిని తొలగిస్తే పని మరింత వేగవంతం కానుంది. నాలుగు ప్రధాన రోడ్లను కలిపే ఈ చౌరస్తాలో విస్తరణ చేపడితే వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోతాయి.

ప్రజావాణిలో సమస్యలపై వినతి

కుత్బుల్లాపూర్‌: ప్రజావాణిలో భాగంగా సోమవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌ శేఖర్‌యాదవ్‌ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజయ్యనగర్‌ ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, రింగ్‌ బస్తీ కమిటీ హాలును వెంటనే చేపట్టాలని, ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన వారికి ఇంటి నెంబర్లు కేటాయించాలని ఉప కమిషనర్‌ మల్లారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఉప కమిషనర్‌ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు పున్నారెడ్డి, జిల్లా స్పోక్స్‌పర్సన్‌ సురేష్‌రెడ్డి, వసుంధర, రాజుయాదవ్‌, మురళి, ఆంజనేయులు, పండరి తదితరులు ఉన్నారు.



అధికారులకు పట్టని సమస్యలు


నిజాంపేట్‌లోని ఓ గల్లీలో ఛిద్రమైన రోడ్డు, పారుతున్న మురుగు..

నిజాంపేట్‌: రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా అధికారులకు పట్టడం లేదని నిజాంపేట్‌ బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్‌ ఆరోపించారు. మంగళవారం నిజాంపేట్‌ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ లైన్లను బీజేపీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా భిక్షపతియాదవ్‌ మాట్లాడుతూ నిజాంపేట్‌ కార్పొరేషన్‌ అధికారులు పాలనను గాలకొదిలేశారని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా వాటిని బుట్ట దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడటంతో రోడ్లు అధ్వానంగా మారాయని, ఏ గల్లీకి వెళ్లినా మురుగు కంపు కొడుతునాయన్నారు. నిజాంపేట్‌ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి హనుమాన్‌ ఆలయం వరకు ఉన్న కమర్షియల్‌ కాంప్లెక్స్‌ల ముందుకు వాహనాలను నిలపడంతో ట్రాఫిక్‌ జామ్‌ అవుతోందని, దీనిపై టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ జ్యోత్స్నకు వినతి పత్రం అందజేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

జిల్లా కెమిస్ట్‌, డ్రగ్గిస్ట్‌ అసోసియేషన్‌ ఎన్నికలు రద్దు చేయాలి

నిజాంపేట్‌: మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా కెమిస్ట్‌, డ్రగ్గిస్ట్‌ ఎన్నికలను రద్దు చేయాలని కెమిస్ట్‌, డ్రగ్గిస్ట్‌ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం ఈ మేరకు అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లా ఈసీ మీటింగ్‌లో చర్చించకుండానే ఎన్నికలు నిర్వహించారని, ఎన్నికల నిర్వహణలో నిబంధనలను తుంగలో తొక్కారని ఆరోపించారు. రాష్ట్ర నాయకత్వం ఈ ఎన్నికలను రద్దు చేసి మరోసారి అందరి ఆమోదంతో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మేడ్చల్‌ – మల్కాజిగిరి జిల్లా కెమిస్ట్స్‌ – డ్రగ్గిస్ట్స్‌ అసోసియేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ గంజి శ్రీకాంత్‌, మల్లాపూర్‌ ప్రెసిడెంట్‌ యాదగిరి, సెక్రటరీ వేణు, కోశాధికారి బాలరాజు, వైస్‌ ప్రెసిడెంట్‌ బాలరాజు, జిల్లా కెమిస్ట్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా క్రిస్మస్‌ వేడుకలు

కుత్బుల్లాపూర్‌: నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్‌ వేడుకలు అంబరానంటాయి. వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వేడుకల్లో చిన్నారులు శాంతాక్లాజ్‌ వేషధారణలో సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


ఎస్‌ఆర్‌ నాయక్‌నగర్‌ సత్యవాణి స్కూల్‌లో..


వెంకటేశ్వనగర్‌లోని సత్‌జ్ఞాన్‌ స్కూల్‌లో..


కొంపల్లిలోని సెయింట్‌ ఆంథోనీస్‌ స్కూల్‌లో..


సూరారం విజేత స్కూల్‌లో..


డ్యాన్స్‌లు చేస్తున్న చిన్నారులు..


సుభాష్‌నగర్‌ భోధివృక్షా ఒలింపియాడ్‌ స్కూల్‌లో..


సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో..